

ఘనంగా రంజాన్

● ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు ● సన్మార్గంలో పయనించండి ● మత పెద్దల పిలుపు



కుబ్రా ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 11: ముస్లింల అత్యంత ప్రధాన పండుగ రంజాన్‌ను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని వయసుల ముస్లింలు ఉదయం 9 గంటలకల్లా ఈద్గా మైదానాలకు చేరుకుని వజూ, అనంతరం ప్రత్యేక దువా ప్రార్థనలు చేశారు. ఎస్సార్బీసీ కాలనీ ఈద్గా (తయ్యబా ఈద్గా)లో మతపెద్ద రఫీ, భీమవరం రోడ్డులోని ఈద్గా(ఆల్ఫుర్‌ఖాన్‌ఈద్గా)లో అబ్దుల్‌హాదీ, బొమ్మలసత్రం మసీదు ఈద్గా మౌలానా మహబుబ్ బాషా, తిక్కస్వామి దర్గావద్ద గల ఈద్గా (కుబ్రా ఈద్గా)ల అంజద్‌బాషాసిద్దీఖీ తదితర మౌలానాలు ఈద్గాలలో ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాలలో నంద్యాల టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, టీడీపీ యువనాయకుడు ఎన్‌ఎండి ఫిరోజ్, ఎమ్మెల్యే రవిచంద్రకిషోర్ రెడ్డి,ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఏపీపీఎస్సీ మెంబర్ డాక్టర్ నౌమాన్‌లు తదితరులు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మతగురువులు ఈద్గాలలో సమాజంలో అందరూ సుఖసంతోషాలతో కలిసిమెలిసి సోదరభావంతో మెలగాలని హితువు పలికారు. అల్లాహ్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఈద్గా మైదానాలు, మసీదులన్నీ ముస్లింల ప్రత్యేక ప్రార్థనలతో కిక్కిరిసి కనిపించాయి. ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారు ఇళ్లకు చేరుకుని, నెలరోజుల ఉపవాస దీక్ష ముగిసిన సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను నిర్వహించుకున్నారు.





ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఫిరోజ్



పుర్‌ఖాన్‌ఈద్గాలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ, ఎమ్మెల్యే





రుద్రవరం మండలం నరసాపురం సమీపంలో అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ 24వ బ్లాక్‌ఛానెల్

పూర్తికాని గంగ పనులు

● 19 ఏళ్లుగా కొనసాగుతున్న బ్లాక్ చానెళ్ల పనులు
● మొదలు కాని 26, 27 బ్లాక్ చానెల్ తవ్వకాలు
● తెలుగుగంగ కింద 27వేల ఎకరాలకు అందని సాగునీరు

రుద్రవరం, ఏప్రిల్ 11 :

రాజకీయ నాయకులకు ఎన్నికలు వస్తేనే రైతులు, రైతు సమస్యలు గుర్తుకు వస్తాయి. ఎన్నికలు దాటాక మర్చిపోతారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని తెలుగుగంగ బ్లాక్ చానెళ్లు, డిస్ట్రిబ్యూటరీ బ్లాక్ చానెళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. వీటికి 2005లో టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. పర్సంటేజీల కోసం రాజకీయ నాయకుల ఒత్తిడి భరించలేక కాంట్రాక్టర్ పనులు మధ్యలో వదిలేశారు. ఎన్నికల సమయంలో ఈ పనులు పూర్తి చేస్తామని రాజకీయ నాయకులు హామీలు ఇస్తూ వచ్చారు. ఇంత వరకు నెరవేర్చనేలేదు. మళ్లీ ఎన్నికలు వచ్చాయి.

టెండర్లు ఇలా

తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి బ్లాక్ చానెల్ పనులు పూర్తి కాకపోవడం ఆళ్లగడ్డ నియోజకవర్గం రైతులకు శాపంగా మారింది. పక్కనే నీళ్లు గలగలా పారుతున్నా పంటలకు నీరందడం లేదు. ప్రతి యేటా రైతులు నీటి కోసం ఎదురు చూస్తునే ఉన్నారు. 2005లో 20, 21 బ్లాక్‌చానెళ్లకు రూ.10 కోట్లతో, 22 నుంచి 2 బ్లాక్ చానెళ్ల వరకు రూ.12 కోట్లతో టెండర్లు పిలిచారు. 23, 24వ బ్లాక్ చానళ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆలమూరు, నరసాపురం గ్రామాల మధ్య అహోబిలం-నరసాపురం గ్రామాల మధ్య బ్లాక్ చానెళ్లపై కల్వర్టు నిర్మించాల్సి ఉంది. ఆ కల్వర్టు ఇన్నేళ్లయినా ఇంతవరకు నిర్మించలేదు. 26, 27 బ్లాక్ చానెళ్ల పనులు ప్రారంభించనే లేదు. 20వ బ్లాక్ చానెల్ కింద 4064 ఎకరాలు, 21వ బ్లాక్ చానెల్ కింద 9721 ఎకరాలు, 22వ బ్లాక్ చానెల్ కింద 5334 ఎకరాలు, 23వ బ్లాక్‌చానెల్ కింద 1578 ఎకరాలు, 24బ్లాక్ చానెల్ 2600, 25 కింద 2808 ఎకరాలు, 26 కింద 649 ఎకరాలు, 27 కింద 344 ఎకరాలకు సాగునీరం దించాల్సి ఉంది. గంగ నీరు ఆర్‌అండ్ బి రోడ్డు దాటదు, రైతుల భూములకు అందదని ఆవేదన వ్యక్తం చేశారు.



బ్లాక్‌ఛానెల్‌లో కంపచెట్లు ఇలా



తెలుగుగంగ ప్రధాన కాల్వలో కూలిపడిన రాళ్లు

నివేదిక పంపించాం

నివేదికలు పంపించాం. అంతలోనే ఎన్నికల కోడ్ అడ్డు వచ్చింది. పనులు వచ్చే ఏడాది చేస్తాం. ఈ లోపు ఉన్నతాధికారుల నుంచి అనుమతి వస్తుంది. అప్పుడు గంగ ప్రధాన కాల్వ సైడ్‌వాల్‌తో పాటు బ్లాక్ చానెళ్ల అసంపూర్తి పనులు చేపడతాం.



- శివశంకరరెడ్డి, ఈఈ, తెలుగుగంగ

కూలిన తెలుగుగంగ ప్రధాన కాల్వలో సైడ్‌వాల్

తెలుగుగంగ ప్రధాన కాల్వలో 21వ గంగ బ్లాక్ చానెల్ నుంచి 22, 23 , 24 గంగ బ్లాక్ చానెళ్ల వరకు గంగ ప్రధాన కాల్వ సైడ్‌వాల్ కూలి కాల్వలో పడిపోయింది. ఒక్కో చోట 20 నుంచి 30 మీటర్లు చాలా చోట్ల కూలిపోయింది. కూలిన రాళ్లు కాల్వలో పడపోయి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



ఆర్జీఎం కళాశాలలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టరు, ఎస్పీ

నంద్యాల క్రైం, పాణ్యం, ఏప్రిల్ 11 : నంద్యాల శాంతిరామ్ మెడికల్, ఫార్మసీ, ఇంజనీరింగ్, పాణ్యం మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలల్లో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరచే స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను గురువారం నంద్యాల కలెక్టర్ కె.శ్రీనివాసులుతో కలిసి ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం వారు ఎన్నికల నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లలో చేపట్టాల్సిన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశిం చారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా నిరంతరం నిఘా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, ఇన్‌స్పెక్టర్ నల్లప్ప, ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, తహశీల్దారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మజ్జిగ, ఖర్జూరం పంపిణీ..

కోట్లపై కేసు నమోదు



డోన్, ఏప్రిల్ 11: ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించారన్న ఫిర్యాదుపై డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. రంజాన్ సందర్భంగా పట్టణంలోని ఈద్గా మసీదు వద్ద టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మజ్జిగ ప్యాకెట్లు, ఖర్జూరం పంపిణీ చేశారు. దీనిపై డోన్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారి, ప్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించారనీ వచ్చిన ఫిర్యాదు మేరకు కోట్లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా వైసీపీ నాయకులు పలు చోట్ల ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

నాటు సారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం

● పాత నేరస్థులపై బైండోవర్ కేసులు పెట్టండి
● సెబ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 11: నాటు సారా, అక్రమ మద్యంపై ఉక్కు పాదం మోపుతామని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ ఎం. సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లాలో ఆయన విస్తృతంగా పర్యటించి, పంచ లింగాల, సుంకేశుల చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, నాటు సారా, అనధికార మద్యం అమ్మకం కేంద్రాలపై దాడులు విస్తృతం చేయాలని ఆదేశించారు. పాత నేరస్థులందరినీ ముంద స్తుగా బైండోవర్ చేయాలని ఆదేశించారు. మద్యం డంపింగ్‌లపై దృష్టి సారించి, పాత నేరస్థులపై నిఘా పెంచాలని తెలిపారు. ప్రధాన కింగ్‌పిన్‌లను గుర్తించి వారిపై పీడీ యాక్ట్, జిల్లా బహిష్క రణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కేఈఆర్ రాజేంద్ర ప్రసాద్, డీటీఎఫ్ సీఐ ఈ.నరసానాయుడు, సుంకేశుల చెక్ పోస్టు సీఐ మల్లిక, పంచలింగాల చెక్ పోస్టు సీఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా రాయబారాది మహోత్సవం



చౌడేశ్వరిదేవి రాయబారాది ఉత్సవం

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 11: ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీదేవి ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం అమ్మవారి రాయబారాది మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జి.కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఉదయం చౌడేశ్వరిదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సాయంత్రంలో గ్రామంలోని ఊరివాకిలి వద్ద ప్రత్యేకంగా అలంకరించి తేరుబండికి గ్రామంలోని రైతుల ఎద్దులను కట్టి గ్రామ శివార్లలో ఉన్న పొలిమేర వద్దకు అమ్మవారి రాయబారాది మహోత్సవాన్ని నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోకి తిరిగి రావడంతో రాయబారాది మహోత్సవం ముగిసింది.

కన్నుల పండువగా చెన్నకేశ్వస్వామి కల్యాణోత్సవం

ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నందవరం గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

నందవరంలో కొనసాగుతున్న అమ్మవారి ఉత్సవాలు

ఘనంగా నిర్వహించారు. గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఆలయ అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేవవస్వామి ఉత్సవ విగ్రహాలకు రాత్రి 10 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించారు.

నేడు జ్యోతి మహోత్సవం : చౌడేశ్వరిదేవి ఉగాది బ్రహోత్మవాల్లో భాగంగా నాలుగోరోజు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జ్యోతి మహోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు అలంకరణ, సాయంత్రం 5 గంటలకు అభయహస్త సేవా సమితి ధర్మవరం బృందంచే అన్నమయ్య సంకీర్తన నిర్వహిస్తారు. అర్ధరాత్రి 12 గంటలకు భాస్కరయ్యాచారితో అమ్మవారికి దిష్టిచుక్క పెట్టే కార్యక్రమం, ఒంటి గంట నుంచి జ్యోతి మహోత్సవం ప్రారంభమవుతుంది.

ఉగాది ఉత్సవాల్లో అపశ్రుతి

- చిన్నటేకూరులో ప్రభకు తగిలిన విద్యుత్ వైర్లు
- 13 మంది చిన్నారులకు విద్యుదాఘాతం
- తప్పిన పెను ప్రమాదం


ఆంజనేయస్వామి ప్రభ

కర్నూలు/కల్లూరు, ఏప్రిల్ 11: కల్లూరు మండలంలో గురువారం జరిగిన ఉగాది ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. చిన్నటేకూరు గ్రామంలో ప్రభకు విద్యుత్ వైర్లు తగిలి అందులో కూర్చున్న 13 మంది చిన్నారులు గాయాలపాలయ్యారు. చిన్నటేకూరు గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా మూడు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయ ప్రభలను గ్రామమంతా ఊరేగించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ఆంజనేయస్వామి ప్రభలను లాగిన గ్రామ పెద్దలంతా తెల్లవారుజాము కావడంతో ఇంటికి వెళ్లిపోగా.. అక్కడున్న కొంత మంది ప్రభను ముందుకు లాగారు. ఈ సమయంలో సుమారు 15 మంది చిన్నారులు (15ఏళ్లలోపు వారే) ఉత్సాహంగా ప్రభల్లో కూర్చున్నారు. ప్రభ లాగుతుండగా రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్ పైకి ఎక్కే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు ప్రభను తాకాయి. ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించడంతో ప్రభలో కూర్చున్న చిన్నారులందరూ విద్యుదాఘాతానికి గురయ్యారు. వారికి గాయాలయ్యాయి. కొంత మంది చిన్నారులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ప్రభ వెంటనే కొంచెం ముందుకు వెళ్లడంతో విద్యుదాఘాతం నుంచి విడిపోయింది. ఈ సంఘటన నుంచి తేరుకున్న స్థానికులు అప్రమత్తమై చిన్నారులను అంబులెన్సులో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు వెంటనే వారికి ప్రథమ చికిత్స అందించడంతో చిన్నారులంతా స్వల్ప గాయాలతో కోలుకున్నారు. ఇద్దరు చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. గాయపడిన వారిలో చిన్నారులు ప్రవీణ్ (12), గౌతమ్ (9), మానిష్ (10), అఖిలేష్ (10), పవన్ (9), ఉమామహేష్ (10), మల్లికార్జున (10), సాత్విక్ (9), మల్లికార్జున (10), వరుణ్ (13), వెంకటేశ్ (11), జశ్వంత్ (13), అజయ్ (12) ఉన్నారు. ప్రస్తుతం చిన్నారులు పీడియాట్రిక్ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో గ్రామస్థులంతా ఆందోళనకు గురయ్యారు. ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ తీగలకు కరెంటు తీసేశామని చెప్పినా కరెంటు ఎలా సరఫరా అయిందో తెలియడం లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను నంద్యాల టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి పరామర్శించారు. చిన్నారులకు అందుతున్న వైద్యసేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. అదేవిధంగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కూడా గాయపడిన చిన్నారులను పరామర్శించారు. ఉలిందకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.


కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు


చిన్నటేకూరు ప్రమాద ఘటన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ యం. ఉమాపతి


గాయపడిన చిన్నారులు

విద్యుత్‌శాఖ తప్పిదం లేదు...
- యం. ఉమాపతి, ఎస్ఈ

చిన్నటేకూరు విద్యుత్ ప్రమాద ఘటనలో విద్యుత్‌శాఖ తప్పిదం లేదని కర్నూలు ఆపరేషన్ ఎస్ఈ యం. ఉమాపతి తెలిపారు. ఈమేరకు ఆయనతో పాటు కర్నూలు డివిజన్ ఈఈ వెంకటేశ్వర్లు గ్రామంలో పర్యటించి ఘటనపై ఆరా తీశారు. చిన్నటేకూరు గ్రామ ఎనర్జీ అసిస్టెంట్ ముందస్తు చర్యగా 11 కేవీ విద్యుత్‌సప్లై ఆఫ్ చేశారన్నారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామి ప్రభను ఊరేగించిన గ్రామస్తులు ప్రభ అలంకరణకు 3 కేవీ జనరేటర్‌ను అమర్చారని అన్నారు. ఉదయం 7.05 నిమిషాలకు ప్రభపై మంటలు వచ్చి 13 మంది పిల్లలు విద్యుదాఘాతానికి గురయ్యారని తెలిపారు. చిన్నటేకూరు గ్రామానికి సరఫరా చేసే లైన్లలో విద్యుత్ ప్రవాహం జరగలేదని నిర్ధారించామని అన్నారు. ఇందులో విద్యుత్‌శాఖ తప్పిదం లేదన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

తుగ్గలి, ఏప్రిల్ 11: ద్విచక్రవాహనం ఢీకొని లాలెమ్మ (46) అనే మహిళ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం జరిగింది. ఉప్పర్లపల్లె గ్రామ శివారులో రోడ్డు పక్కన పడి వున్న చెత్త చెదారంలోని గుజిరి సామాన్లు పోగు చేసుకుంటున్న మహిళ లాలెమ్మను ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లాలమ్మను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక గురువారం మృతి చెందింది. మృతురాలి భర్త ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. లాలమ్మది అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం అంబులదిన్నె గ్రామం.

రెండు బైకులు ఢీకొన్న ఘటనలో..

నందవరం, ఏప్రిల్ 11: మండల పరిధిలోని కనకవీడు, పూలచింత గ్రామాల మధ్యలో రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో కుమ్మరి రాముడు(30) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. రాముడు బంధువు ఒకరు మరణించడంతో అంత్యక్రియలకు వెళ్లి బైక్ మీద తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పూలచింత క్రాస్ దగ్గర మరో మోటర్ బైక్ అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రాముడిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో రైతు...

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 11: ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన బొట్టా మద్దిలేటి (45) అనే రైతు వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటూ వడదెబ్బ సోకి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. మండలంలోని కరివేన గ్రామానికి చెందిన మద్దిలేటి వేసవి దుక్కుల కోసం తన పొలంలో గట్లను ఏర్పాటు చేసుకొనే పనుల్లో ఉండగా ఎండ తీవ్రతకు అక్కడి కక్కడే కుప్పకూలి పోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఆటోలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మద్దిలేటి మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మద్దిలేటి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

వాగులో మునిగి బాలుడి మృతి

పాణ్యం, ఏప్రిల్ 11 : రంజాన్ పర్వదినాన ఆనందంగా గడపాల్సిన ఆ కుటుంబంలో విషాదం నిండింది. పాణ్యం మండలంలోని కౌలూరు గ్రామానికి చెందిన దూదేకుల ఉశేన్‌బాష కుమారుడు అహ్మద్ షమీర్ (13) కానుగల వాగులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. షమీర్ చిన్నాన్న మహ్మద్ హుశేన్‌తో మోటారుసైకిల్ కడుక్కోవడానికి గ్రామానికి సమీపంలోని కానుగల వాగుకు వెళుతుండగా షమీర్ కూడా వెళ్లాడు. మహ్మద్ హుశేన్ మోటారుసైకిల్ కడుక్కుంటుండగా షమీర్ ఈతకొడుతూ వాగు ప్రవాహ ఉధృతికి నీటిలో మునిగిపోయాడు. కొనఊపిరితో ఉన్న షమీర్‌ను శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడని ఎస్ఐ అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మళ్లీ కొండముచ్చు దాడి

- ఆరుగురికి గాయాలు
- భయాందోళనలో ప్రజలు


కొండుముచ్చు దాడిలో తీవ్రగాయాలైన దృశ్యం

డోన్(రూరల్), ఏప్రిల్ 11: పట్టణంలో కొండముచ్చు మరోసారి ప్రజలపై దాడి చేసింది. గురువారం కొండముచ్చుల గుంపు పట్టణంలోని పలు కాలనీల మీద పడి పలువురిపై దాడి చేసింది. ఈ దాడిలో ఆరుగురు గాయపడ్డారు. వీరు డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్స కోసం వచ్చారు. గత నాలుగు రోజుల నుంచి వరుసగా కొండముచ్చు పట్టణంలో హల్‌చల్ చేస్తూ వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తూనే ఉన్నాయి. కొండముచ్చులను పటుట్టకోవడానికి అటవీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. దీంతో పట్టణ ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. కొండముచ్చు దాడిలో గాయపడి ఆసుపత్రుల పాలైన కేసులు 30 దాకా వచ్చాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కొండముచ్చులను అటవీ అధికారులు పట్టుకోకపోతే బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

బుజ్జమ్మ దంపతులకు గన్‌మెన్ల తొలగింపు

- టీడీపీలో చేరడమే కారణమా...?


గన్‌మెన్‌తో కప్పట్రాళ్ల బుజ్జమ్మ దంపతులు (ఫైల్)

ఆలూరు, ఏప్రిల్ 11: టీడీపీ నాయకురాలు కప్పట్రాల బుజ్జమ్మ, రామచంద్రనాయుడు దంపతులకు ఫ్యాక్షన్ నేపథ్యంలో సీఎం జగన్ ప్రత్యేకంగా వారి భద్రతకు గన్‌మెన్లను ఏర్పాటు చేశారు. ఇటీవల బుజ్జమ్మ దంపతులు వైసీపీను వీడి టీడీపీలో చేరడంతో బుధవారం రాత్రి వారి గన్‌మెన్లను తొలగించారు. ఎన్నికల వేళ ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న తమకు సీఎం జగన్ కావాలనే భద్రత లేకుండా చేశారని వారు ఆరోపిస్తున్నారు.

గన్‌మెన్ల తొలగింపుపై సందేహాలు...

వైసీపీలో ఉన్న కప్పట్రాల బుజ్జమ్మకు 2+1 రామచంద్ర నాయుడుకు 1+1 చొప్పున గన్‌మెన్లను ఏర్పాటు చేశారు. పార్టీ మారడం వల్లే వారికి ప్రభుత్వం వారికి గన్‌మెన్లను తొలగించినట్లు ఫ్యాక్షన్ గ్రామాల్లో ఉంటున్న కప్పట్రాళ్ళ బుజమ్మ వర్గీయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇంటిలిజెన్స్ వర్గాల ద్వారా నివేదికను తెప్పించి టీడీపీ నేత బుజ్జమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

బ్రాహ్మణుడిపై వైసీపీ నాయకుడి దాడి

- వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ ప్రచారంలో ఘటన
- ఖండించిన బ్రహ్మణ సంఘాల నేతలు

కర్నూలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన 51 వార్డు వైసీపీ ఇన్‌చార్జి కృష్ణకాంత్ శర్మపై అదే వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు రాఘవేంద్రనాయుడు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు వెంకటరామరాజు పేర్కొన్నారు. గురువారం కర్నూలు జిల్లా బ్రహ్మణ సంఘాల జేఏసీ కన్వీనర్ దేవిప్రసాద్, ఏపీబీఎస్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రావు, బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి అధ్యక్షుడు చంద్రశేఖర్, ఏపీబీఎం అధ్యక్షుడు సాయినాథ్‌శర్మ, పరశురామ్ పరివార్ అధ్యక్షుడు ఆనంద్ రావు, సుబ్రహ్మణ్యప్రసాద్‌లతో కలసి బాధితులు కృష్ణకాంత్ శర్మ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధితుడితో కలసి విలేకరులతో మాట్లాడారు. బుధవారం వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ అహ్మద్ షరాఫ్‌బజారులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇదే కార్యక్రమంలో 51వ వార్డు కన్వీనరు హోదాలో బాధితుడు కృష్ణకాంత్‌శర్మ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలో వైసీపీ అభ్యర్థి సమక్షంలోనే అకారణంగా మరో వైసీపీ నాయకుడు రాఘవేంద్ర నాయుడు తనపై దాడి చేశాడని, 'ఎందుకు కొడుతున్నావు..' అని అడిగినా పట్టించుకోకుండా విచక్షణ కోల్పోయి తనపై దాడి చేశాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు వెంకటరామరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 200 మంది బ్రాహ్మణులపై దాడులు జరిగాయన్నారు.


మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

బాధితుడు కృష్ణకాంత్‌శర్మకు తక్షణమే వైసీపీ నాయకుడు క్షమాపణ చెప్పాలన్నారు. లేనిపక్షంలో త్వరలో కార్యాచరణ రూపొందించి బాధితులకు అండగా ఆందోళనలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఏపీ బ్రాహ్మణ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మారుతీశర్మ మాట్లాడుతూ పురోహితులు, అర్చకులపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని అన్నారు. దాడిని ప్రతి ఒక్క బ్రాహ్మణుడు ఖండించాలని కోరారు. పార్టీలకు అతీతంగా బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులను అడ్డుకునేందుకు ముందుంటున్నామని అన్నారు.

టీడీపీ కూటమి గెలిస్తేనే అభివృద్ధి: గౌరు చరిత


36వ వార్డు రిచ్‌మండ్‌విల్లాస్‌లో శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 11: టీడీపీ కూటమిలోని చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత స్పష్టం చేశారు. గురువారం కల్లూరు అర్బన్ 36వ వార్డు రిచ్‌మండ్‌విల్లాస్‌లో ఆమె శంఖారావం, టీడీపీ సూపర్‌సిక్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరి భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి, పియూ.మాదన్న, పెద్దబీచుపల్లి, ధనుంజయ, చిన్నబీచుపల్లి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సైకో జగన్‌ను సాగనంపుదాం

కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు


మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు నాగరాజు, రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 11 : ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి బీసీలకు అన్యాయం చేసిన సైకో జగన్‌ను గద్దె దింపేందుకు సిద్ధం కావాలని కర్నూలు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డితో కలసి ఆయన వాల్మీకి, కురువ సామాజిక వర్గాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వాల్మీకి, కురువ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులను చంద్రబాబు నాయుడు టికెట్లు కేటాయించారని, ఆయన రుణం తీర్చుకోలేనిదన్నారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రతి ఒక్కరూ త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి దళితులకు, బీసీలకు అన్యాయం చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని ఆరోపించారు. బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని భ్రష్టు పట్టించిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు పల్లెపాడు ముత్తురెడ్డి, రామారెడ్డి, రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణ, మాలపల్లి లక్ష్మయ్య, జ్ఞానేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలను శాసిస్తున్న డబ్బు

- 800 చిత్రాల్లో నటించా..
- సినీ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు
- పిఠాపురం నుంచి పవన్‌కళ్యాణ్ గెలుపు తథ్యం
- ప్రముఖ సినీ నటుడు సుమన్



మంత్రాలయం, ఏప్రిల్ 11: ప్రస్తుత రాజకీయాలన్నీ డబ్బుతో కూడుకున్నాయని, గెలుపోటములను డబ్బు శాసిస్తోందని ప్రముఖ సినీ నటుడు సుమన్ అభిప్రాయపడ్డారు. గురువారం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సినీ పరిశ్రమలో పది భాషల్లో దాదాపు 800 చిత్రాల్లో నటించానని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. తెలుగులో హీరోగా వంద చిత్రాలు, తమిళలో 50 చిత్రాలు, కన్నడ 25 చిత్రాల్లో నటించానని ఆయన తెలిపారు. రాజకీయాల్లో డబ్బే ప్రధానమని, డబ్బు ఎక్కడ ఉంటే.. అక్కడ గెలుపు ఓటములు తారుమారయ్యే అవకాశం ఉందని తెలిపారు. అయినా కొన్ని చోట్ల మాత్రం అభ్యర్థుల స్టార్ ఇమేజ్ పనిచేస్తుందన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, హీరో పవన్‌కళ్యాణ్ పిఠాపురం నుంచి గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎమ్మిగనూరులో మూడురోజులు ఎంఈవో సునంద నిర్మాతగా, ప్రసాద్ డైరెక్టరుగా 'చట్టమా.. శాసనమా' అనే చిత్ర షూటింగ్ జరుగుతోందన్నారు. అందులో పాల్గొనేందుకు వచ్చినట్లు తెలిపారు. తండ్రీ కూతుళ్ల మధ్య ఉండాల్సిన అనుబంధం, కుటుంబ నేపథ్యం, సంప్రదాయం, సంస్కృతి వంటి సందేశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. మంత్రాలయానికి మూడుసార్లు వచ్చానని, ఈ నెల 23న మంత్రాలయం, మైదుకూరులోని బ్రహ్మంగారి మఠాన్ని దర్శించుకునేందుకు సన్నాహాలు చేసుకున్నానని, అదేవిధంగా ఎమ్మిగనూరులో మూడు రోజుల షూటింగ్ ప్లాన్ చేయడంతో రాఘవేంద్రస్వామిని, పీఠాధిపతిని దర్శించుకోవడంతో తన జీవితం ధన్యమైందని అన్నారు. 46 ఏళ్ల సినీ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొనాల్సి వచ్చిందని, తాను నమ్ముకున్న నటనే తనను ఇంతటివాడ్ని చేసిందన్నారు. సిని పరిశ్రమంలో తనకంటూ గాడ్‌ఫాదర్ ఎవరూలేరని సుమన్ తెలిపారు. 800 చిత్రాల్లో శ్రీరామదాసు, అన్నమయ్య, పరువుప్రతిష్ట, బావబామ్మర్ది తదితర చిత్రాల్లో తనకు వందలాది పురస్కారాలు, అవార్డులు దక్కాయన్నారు.


సుమన్‌కు మెమెంటో ఇస్తున్న పీఠాధిపతి

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: బుడ్డా



బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన దళిత కుటుంబాలు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 11: టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి కోరారు. మండలంలోని చిన్నదేవళాపురం గ్రామానికి చెందిన కంచర్ల సురేష్‌రెడ్డి, కొరకంచి శంకర్, తాటికొండ బుగ్గరాముడు, కొరకంచి లింగారెడ్డి ఆధ్వర్యంలో 30 దళిత కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. అలాగే ఎ.కోడూరు మాజీ సర్పంచ్ కుమారుడు వైసీపీకి చెందిన వడ్డు మధుసూదన్‌రెడ్డి, శివలింగం, బాలరాజు, వెంగళరెడ్డి, త్యాగరాజుతో పాటు మరో 30 కుటుంబాలకు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో శివుడు, వెంకటేశ్వర్లు, మహేశ్‌తారక్ పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి: మాండ్ర



నాగటూరులో శంఖారావం కార్యక్రమంలో పాల్గొన్న మాండ్ర

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 11: వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పిలుపునిచ్చారు. నందికొట్కూరు మండలంలోని నాగటూరు, కొణిదేల, వడ్డెమాను గ్రామాల్లో గురువారం శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. మాండ్ర మాట్లాడుతూ టీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు బాగు పడాలంటే చంద్రబాబు అధికారంలోకి వస్తేనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి జయసూర్య, టీడీపీ మండల కన్వీనర్ ఓబులరెడ్డి, మల్లికార్జున రెడ్డి, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, పలుచాని మహేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానానికి అంబులెన్స్ వితరణ



అంబులెన్సుకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, ఏప్రిల్ 11: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న వైద్యశాలకు గురువారం అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన అంబులెన్సును వితరణగా అందజేశారు. ఈ అంబులెన్సును కామినేని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ శశిధర్ విరాళంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారికి అందజేశారు. అంబులెన్సు విలువ రూ.50 లక్షలు ఉంటుందని దాత తెలిపారు. ఉదయం ఆలయ ముందుభాగంలోని గంగాధర మండపం ఎదురుగా అంబులెన్సుకు ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి వాహన పూజాదికాలు నిర్వహించారు. ఈవో డి. పెద్దిరాజు మాట్లాడతూ దేవస్థానం వైద్యశాల ద్వారా భక్తులు, స్థానికులు, సిబ్బందికి వైద్యసేవలు అందజేస్తుందన్నారు. వైద్యశాలలో అత్యవసర సేవలు అందించి తదుపరి మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఈ అంబులెన్సు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. భక్తుల వైద్యసేవల కోసం దేవస్థానం ప్రాణదాన ట్రస్టును నిర్వహిస్తుందని దాతలు ఇతోధికంగా వైద్యశాలకు విరాళాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, పీఆర్వో శ్రీనివాసరావు, కామినేని వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి..



భక్తుడికి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో ఫణిధర్‌ప్రసాద్

శ్రీశైలం, ఏప్రిల్ 11: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి ఓ భక్తుడు గురువారం లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కె.సత్యనారాయణ కుటుంబ సమేతంగా వచ్చి విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర్ ప్రసాద్‌కు అందజేశారు. భక్తుడికి దేవస్థానం అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

మూల పెద్దమ్మకు పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

గడివేముల, ఏప్రిల్ 11: జాతర సందర్భంగా మండల కేంద్రంలోని మూల పెద్దమ్మ ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి ముడుపులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి కుంకుమార్చన, ఆకు పూజ చేశారు. భక్తులు బియ్యం, బ్యాళ్లు, బోనాలను సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తన సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

మహానంది క్షేత్రానికి రూ.42 లక్షల ఆదాయం

మహానంది, ఏప్రిల్ 11: ఉగాది పర్వదినం పురస్కరించుకొని మహానందీశ్వరుని దర్శనం కోసం వచ్చిన భక్తుల వల్ల రూ.42,24,818 ఆదాయం దేవస్థానానికి వచ్చినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి గురువారం సాయంత్రం తెలిపారు. ఈనెల 6 నుండి 10 వ తేది వరకు ఉగాది పర్వదినం పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రం నుంచి లక్షలాదిమంది కన్నడిగులు దర్శనం కోసం మహానందికి వచ్చారు. ఇందులో భాగంగా వివిధ సేవల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది ఉగాది కన్నడ భక్తుల ద్వారా రూ.31,59,611 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

ఘనంగా రంజాన్

- ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు చెప్పుకున్న ముస్లింలు
- పండుగ విశిష్టతను వివరించిన మత పెద్దలు
- మతాలకతీతంగా సోదరభావంతో మెలగాలని పిలుపు



బండిఆత్మకూరు ఈద్గాలో ఖురాన్ సందేశాన్ని వింటున్న ముస్లింలు



ముస్లింలతో మాండ్ర శివానందరెడ్డి, జయసూర్య



మాజీ ఎమ్మెల్యే బుడ్డాకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ నాయకురాలు మోమిన్ షబాన

ఆత్మకూరు, ఏప్రిల్ 11: ఆత్మకూరు పట్టణంలో గురువారం రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని కొత్తపేట పెద్ద మసీదు, రహమత్‌నగర్‌లోని మక్కా మసీద్, రహమానియా మసీద్, లక్ష్మీనగర్‌లో ఖుగ్రామసీద్, బస్టాండ్ సమీపంలోని యాసీన్‌మసీద్, మోమిన్‌నగర్‌లోని మోమిన్‌మసీద్, పెద్దకబేలా సమీపంలోని ఉమరేతారెఫ్ మసీద్, సంతమార్కెట్ సమీపంలోని ఆసర్‌మసీద్, నీలితోట్ల వీధిలోని మహ్మదీయమసీద్, అర్బన్‌కాలనీలోని అతాయిరసూల్ మసీద్, శ్రీశైలం రస్తాలో ఉన్న మదరసామసీద్, పెద్దబజారులోని చౌక్‌మసీద్ అయా కాలనీల్లో ఉన్న అన్ని మసీదులతో పాటు దుద్యాల రస్తాలో ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా మసీదుల్లో మతపెద్దలు రంజాన్ సందేశాన్ని జనులకు వినిపించి అందులోని మంచి విషయాలకు వెల్లడించారు. ప్రతివ్యక్తి దానగుణం కలిగి ఉండాలని, తనకు ఉన్నదాంట్లో దానం చేయడమే గొప్పలక్ష్యంగా భగవంతుడు పేర్కొన్నారని గుర్తుచేశారు. ప్రతిఒక్కరూ మహ్మద్ ప్రవక్త చూసిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. అనంతరం నంద్యాల రస్తాలో ఉన్న ఖబరస్తాన్‌లోని తమ పితురుల సమాధుల వద్దకు వెళ్లి నివాళి అర్పించారు.

ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా:

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక నంద్యాల టర్నింగ్ వద్ద ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి ముస్లింలను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు నెలరోజుల పాటు ఉపవాసదీక్షలు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. స్నేహం, కరుణ, క్షమ, క్రమశిక్షణ, దయాగుణాలకు ప్రతీకగా నిలిచే రంజాన్ పర్వదినం మానవాళిని ఆదర్శంతంగా తీర్చిదిద్దబడుతోందని అన్నారు. ఆ భగవంతుడి ఆశీస్సులతో ప్రజలందరు సంతోషకంగా గడపాలని ఆకాంక్షించారు. ఇదిలావుంటే ముస్లిం సోదరులు పెద్దఎత్తున తరలివచ్చి మాజీ ఎమ్మెల్యే బుడ్డాకు ఆత్మీయంగా పలుకరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాగా బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ మోమిన్ షబాన మాజీ ఎమ్మెల్యే బుడ్డాను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, టీడీపీ మైనార్టీ విభాగం నాయకులు కలీముల్లా, నాగూర్‌ఖాన్, నాయకులు అబ్దుల్లాపురం బాషా, ఫక్రుద్దీన్, రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

వెలుగోడు: ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని ముస్లిం మత పెద్దలు సూచించారు. రంజాన్ పండుగను గురువారం పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాజంలో నెలకొన్న అశాంతిని తొలగించి శాంతి కలిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యూనస్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని అలెహదీస్, సున్నీజమాత్ ఈద్గాల వద్ద గురువారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అల్లూరు రోడ్డులోని అలెహదీస్ వద్ద మత గురువులు మౌలానా ఇస్మాయిల్, మౌలానా రఫిక్, కర్నూలు రోడ్డులోని సున్నీజమాత్ ఈద్గా వద్ద ముక్తి అబ్దుల్ రెహమాన్, మౌలానా అబ్దుల్ రెహమాన్ పండుగ విశిష్టత గురించి వివరించారు. చిన్నారులు కూడా ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన మాండ్ర, జయసూర్య

టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు షకీల్ అహ్మద్, జాకీర్, ముర్తుజావలి, జమీల్, పలుచాని మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలో ముస్లింలు రంజాన్ పండుగ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాములపాడులోని ఈద్గా వద్ద ముస్లింలు సాముహిక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

పగిడ్యాల: మండలంలోని ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానాలు మహ్మద్ ప్రవక్త బోధనలు, సందేశాలను వినిపించారు. అనంతరం పిల్లలు, పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముచ్చుమర్రి పోలీసు బందోబస్తు చేపట్టారు.

మిడుతూరు: మండలంలో రంజాన్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మత పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమని అన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మండలంలో గురువారం రంజాన్ పండగ వేడుకలు ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక పార్థనలు చేశారు.

కొత్తపల్లి: మండలంలో రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదులు, ఈద్గాలలో ప్రార్థనలు చేశారు. దుద్యాల, శివపురం, ముసలిమడుగు, కొత్తపల్లి, ఎదురుపాడు, నందికుంట, వీరాపురం, కొక్కెరంచ తదితర గ్రామాల్లో వేడుకలు జరుపుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మహానంది: మండలంలో గురువారం ఘనంగా రంజాన్ వేడుకలను ముస్లింలు నిర్వహించుకొన్నారు. గాజులపల్లి, గోపవరం, బుక్కా పురం, ఎం.తిమ్మాపురం, నందిపల్లి, తమ్మడపల్లి, మసీదుపురం, యి.బొల్లవరంలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. మానవాళికి ధార్మిక జీవనానికి దిశా నిర్దేశం చేసేది రంజాన్ అని ముస్లిం మత పెద్దలు తెలిపారు.

బండిఆత్మకూరు: మండలంలో ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. పేదలకు దానం చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

గోస్పాడు: మండలంలోని గోస్పాడు, పసురుపాడు, యాళ్ళూరు, జిల్లెల్ల, తదితర గ్రామాలలో ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం ఆయా గ్రామాల్లోని మసీదుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆయా మసీదుల్లోని మత గురువులు ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో అందరూ సుఖసంతోషాలతో కలిసిమెలిసి అన్నదమ్ముల్లా జీవించాలని సూచించారు. దేశంలోని అన్ని మతాలు, కులాల, జాతుల వారు పరస్పర సోదర భావంతో మెలిగి నవ భారత్ వైపు అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు.

పాణ్యం: మండలంలో రంజాన్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాణ్యం ఈద్గా వద్ద ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కౌలూరు పరిధిలోని సున్నీ మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సున్నీ మసీదు వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈద్గాల్లో ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మత పెద్దలు మహమ్మద్ ప్రవక్త బోధనలను వినిపించారు.



వెలుగోడులో..



మహానంది: ప్రార్థన చేస్తున్న ముస్లింలు



గడివేములలో..



మిడుతూరులో..



కొత్తపల్లి: శివపురంలో..



పగిడ్యాల: లక్ష్మాపురంలో..



జూపాడుబంగ్లాలో..

పూలే బాటలో నడవాలి

- నివాళి అర్పించిన ప్రముఖులు
- ఘనంగా జయంతి వేడుకలు



నంద్యాలలో నివాళి అర్పిస్తున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావు పూలే బాటలో ఉద్యోగులు, యువత, ప్రతి ఒక్కరూ నడవాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రప్ప అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా సహాధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కార్యదర్శి తిరుపాలయ్య, కోశాధికారి బి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఆర్.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నంద్యాల (కల్చరల్): కులాలలో అంటరానితనాన్ని దూరం చేసి ఆధునిక హిందూ సమాజ నిర్మాణానికి మహాత్మా జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని బీజేపీ నంద్యాల పార్లమెంట్ కోఆర్డినేటర్ అభిరుచి మధు అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి అభిరుచి మధు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లె ఎలీషా అన్నారు.గురువారం జ్యోతిరావుపూలే 198వ జయంతిని పురస్కరించుకుని స్థానిక సంగమేశ్వర సర్కిల్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు చింతలయ్య, రవికుమార్, భాస్కర్, కేశవులు తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను బండిఆత్మకూరులో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు డేవిడ్ అధ్యక్షతన నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఎం నాయకుడు రత్నమయ్య, చల్లా వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కులవివక్షత రూపుమాపటం కోసం జీవితాంతం పూలే పోరాటాలు చేశారని, ఆర్థిక అసమానత, లింగ వివక్షత రూపుమాపాలన్నదే ఆయన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో రాజు, సురేష్, శివ, దశరథుడు, ఓబులపతి పాల్గొన్నారు.

వెలుగోడు: బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి రావు పూలే అని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని వెలుగోడు పట్టణంలో పూలే విగ్రహానికి బీసీ సంఘం నాయకులు రఘురాముడు యాదవ్, ఇమ్మానియేల్, నాగశేషులు రాందాస్, లాయర్ రవిలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అంకన్న, నాగన్న, నాగేశ్వరరావు, భాస్కర్‌గౌడ్, శివుడు, ఏసురత్నం, రామలింగం, గంగాధర్, వేల్పుల రవి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయసాధన కోసం కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జయసూర్య అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జయసూర్య మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధరణకు విశేష కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావుపూలే అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, ముర్తుజావళి, షకీల్‌ఖ అహ్మద్, జాకీర్ హుస్సేన్, మద్దిలేటి, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం పాములపాడులో పూలే విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ మురళీమోహన్, నాయకులు సీతారాం గోపాల్, శంకర్ గోవింద్, రామ్మోహన్ డాక్టర్ రాజు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ సమాజంలోని బడుగు, బలహీన వర్గాలపై వివక్ష అన్యాయాన్ని రూపు మాపటానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: సామాజిక సమానతలు లేని సమాజం కోసం పాటు పడిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయసాధనకు కృషి చేద్దామని వేల్పుల ఆనంద్, సభాధ్యక్షుడు సరస్వతి పాఠశాల కరస్పాండెంట్ మల్లయ్య అన్నారు. గురువారం కొత్తపల్లిలోని సరస్వతి స్కూలు ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలేజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. సింగరాజుపల్లి, గుమ్మడాపురం గ్రామాల్లో స్థానిక సర్పంచ్ నక్క విజయకుమార్, కేవీపీఎస్ జిల్లా నాయకులు సంపత్ కుమార్, సీపీఎం నాయకులు నక్క స్వాముల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. నాయకులు నాగేశ్వరగౌడు, కుక్కన్న, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్ ప్రసాద్ యాదవ్, దినేష్, డా.రాము, హరియాదవ్, లక్ష్మణ యాదవ్ పాల్గొన్నారు.

కమనీయం.. వేణుగోపాలుడి కల్యాణం



వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కొత్తపల్లి, ఏప్రిల్ 11: మండలంలోని దుద్యాల గ్రామంలో వెలసిన లక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, పార్వతి సమేత మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అశేష భక్తజనం మధ్య కమనీయంగా సాగింది. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు జరిగే మహోత్సవంలో భాగంగా మొదటి రోజు బుధవారం అర్ధరాత్రి స్వామి కల్యాణోత్సవం ఈవో కార్తీక్, పురోహితులు సుబ్రహ్మణ్య శర్మ, పాలక మండలి చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, పుర ప్రముఖుల సమక్షంలో కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ముందుగా పురోహితులు ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి మాంగళ్యధారణ, కన్యాదానం, ముత్యాల తలంబ్రాలు, బాజీ భజంత్రీల మధ్య శాస్త్రోత్తంగా కల్యాణ వేడుకలను పుర ప్రముఖులు, భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది.

'శివభాష్యం గౌడ్ సేవలు మరువలేనివి'

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 11: వరదరాజస్వామి ప్రాజెక్టు కార్యసాధకుడు దివంగత శివభాష్యం గౌడ్ సేవలు మరువలేనివని గౌడ సంఘం నాయకులు హరినాథ గౌడ్, తిరుమలేష్ గౌడ్ అన్నారు. గురువారం ఆత్మకూరు మండలంలోని నల్లమల అరణ్యంలోని వరదరాజస్వామి ప్రాజెక్టు వద్ద శివభాష్యం గౌడు 21వ వర్థంతి కార్యక్రమాన్ని శివభాష్యం కుమారులు మల్లికార్జున గౌడ్, కరుణాకర్ గౌడ్, బుసగౌడు, భాస్కర్‌గౌడు ఆధ్వర్యంలో గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా శివభాష్యం సమాధి వద్ద ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ వడ్లరామాపురం గ్రామానికి చెందిన శివభాష్యం గౌడు జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో వడ్లరామాపురం గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా రంజాన్


రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ


సంజామలలో ముస్లింల ప్రార్థనలు


బనగానపల్లెలో ప్రత్యేక నమాజులో పాల్గొన్న ముస్లింలు

రంజాన్ వేడుకను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ఈద్ నమాజులు నిర్వహించారు. ఈద్గాల వద్ద ముస్లిం మతపెద్దలు ప్రార్థనలు చేయించి, దైవ సందేశం అందించారు. రంజాన్ మాసం 30 రోజుల్లో ఉపవాసం దీక్షల ద్వారా ఎలాంటి పరివర్తన చెందారో అలాగే ఏడాది పొడవునా కొనసాగించాలని ఉద్బోధించారు. ఈ మాసంలో చేసిన ఉపవాసాలు, దానధర్మాలు, పుణ్యకార్యాలు మానసిక సంతృప్తితోపాటు సంఘజీవులుగా పరస్పరం కలిసిమెలసి జీవించేందుకు దోహదపడతాయని చెప్పారు. రంజాన్‌లో దానాలు ఇవ్వడం అనేది గొప్ప కార్యమమని చెప్పారు.

డోన్, ఏప్రిల్ 11 : టీడీపీ అధినేత చంద్రబాబుతోనే ముస్లింల అభివృద్ధి అని డోన్ టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గుత్తి రోడ్డులో ఈద్గా మసీదు వద్ద ముస్లింలకు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మజ్జిగ ప్యాకెట్లను ఆయన ముస్లింలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రిరమణ, అన్వర్‌బాషా, ఎస్ఎండీ రఫీ, బాష్యం శ్రీధర్‌గౌడు, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె, ఏప్రిల్ 11: బనగానపల్లె మండలంలో రంజాన్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలో అన్ని మసీదులు, ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువులు మహమ్మద్ ప్రవక్త బోధనలను వివరించారు. ఎస్సార్బీసీ కాలనీ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. అవుకు, బనగానపల్లె, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల ముస్లింలు బనగానపల్లె టీడీపీ కార్యాలయం వద్దకు బీసీ జనార్దన్‌రెడ్డిని కలిశారు. బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మలు శుభాకాంక్షలు తెలియజేశారు. బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి కూడా రంజాన్ పండుగ శుభాకాంక్షలు అందించారు. పట్టణంలోని ఈద్గా నగర్‌లో పట్టణానికి చెందిన పుల్లారెడ్డి ముస్లింలకు మజ్జిగ పంపిణీ చేశారు.

బేతంచెర్ల: మండలంలో రంజాన్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. కొలుములపల్లె రస్తాలో ఉన్న ఈద్గాకు చేరుకుని మండల ఖాజీ నూర్ అహ్మద్ రంజాన్ సందేశాన్ని ఇచ్చారు. బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర్ నాయక్ తన సిబ్బందితో గట్టి పోలీసుబందోబస్తు నిర్వహించారు.

డోన్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లీం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని కొత్తపల్లి, చిన్నమల్కాపురం, పెద్దమల్కాపురం, చనుగొండ్ల తదితర గ్రామాల్లోని మసీదులలో ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్యాపిలి, ఏప్రిల్ 11: పట్టణంలో గురువారం ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జామియా మజీద్‌లో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముస్లింలు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే పేద ముస్లింలకు ఆర్థిక, వస్తు, దుస్తులు దానం చేశారు.

సంజామల: సంజామల మండలంలో రంజాన్ పర్వదినా న్ని గురువారం ముస్లింలు సంప్రదా య బద్ధంగా జరుపుకు న్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు.

ఆళ్లగడ్డ: మండలంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మత పెద్ద ఖాజీ మహమ్మద్ సిద్ధిఖ్ రంజాన్ పండుగ ప్రాముఖ్యత గురించి వివరించి ప్రార్థనలు చేయించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాల వద్ద గురువారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉయ్యాలవాడ, బోడెమ్మనూ రు, కాకరవాడ, ఇంజేడు, హరివరం, నర్సిపల్లె, మాయలూ రు, తుడమలదిన్నె తదితర గ్రామాల్లో మత పెద్దలు దానధర్మాల గురించి వివరించారు. ఉయ్యాలవాడ మత గురువు షంసులుద్దీన్ పాల్గొన్నారు. స్థానిక కుందూనది సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు పేదలకు ఆర్థిక సాయం చేశారు.

రుద్రవరం: రుద్రవరం, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, కోటకొండ, యల్లావత్తుల, మందలూరు, చందలూరు, నరసాపురం, ఆలమూరు, ముత్తలూరు గ్రామాల్లో ఈదుల్‌ఫితర్ నమాజ్‌లు భక్తిశ్రద్ధలతో చేశారు.

కొలిమిగుండ్ల రూరల్: మండలంలో రంజాన్ పర్వదిన వేడుకలను గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాలలో ముస్లింలు పెద్ద ఎత్తున మసీదులు ఈద్గాల వద్దకు చేరుకొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. రిటైర్డు గ్రంథాలయాధికారి మహబూబ్‌ఖాన్, హుసేన్ సోదరులు, దస్తగిరి, బుడేన్‌సా, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రంజాన్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శిరివెళ్ల: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి శిరివెళ్లలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

టీడీపీలో చేరిన 110 కుటుంబాలు


టీడీపీలో చేరిన గుల్లదుర్తికి చెందిన కుటుంబాలు

బనగానపల్లె, ఏప్రిల్ 11 : బనగానపల్లె నియోజకవర్గంలో ఒకే రోజు 110 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నియోజకవర్గంలోని కోవెలకుంట్ల మండలం గుల్లదుర్తికి చెందిన 80 వైసీపీ కుటుంబాలు వైసీపీకి భారీగా షాక్ ఇస్తూ టీడీపీలో చేరాయి. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సంతటి రమేశ్‌రెడ్డి, పోరుమామిళ్ల నాగమద్దిలేటి, బొజ్జి శ్రీనివాస రెడ్డి, వంగలి బాలదస్తగిరి, అల్లూరు గంగన్న, అవిశె వెంకటసుబ్బయ్య, చాకలి నరసింహులు, వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యం, దస్తగిరి, బాల పుల్లయ్య, వల్లభుడు, గుద్దేటి చిన్నవెంకటరామిరెడ్డి, ఊల జనార్దన్, రాముడు, నల్లగట్ల పుల్లయ్య, ఓబన్న, తలారి శ్రీరాములు, సుబ్బరాయుడు, మౌలాలి, కొండన్న, శ్రీని వాసులు, తదితరులు టీడీపీలో చేరారు. కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయునిపేటకు చెందిన 30 ముస్లిం వైసీపీ కుటుంబాలు వైసీపీని వీడి గురువారం టీడీపీలో చేరాయి. బొడెమ్మగారి హాజీబాషా, ముఖ్యబాయిగారి హాజీబాసా ఆధ్వర్యంలో దూదేకుల ఆటో దస్తగిరి, గడేకారి మాబూ, దొడియం దస్తగిరి, మాబూ, సిలుంబాషా, ఎర్రగుడి హుసేన్‌వలి, నందిపాడు మహబూబ్ వలి, అంకిరెడ్డిపల్లె పెద్దకులాయి, చిన్నకులాయి, అబ్దుల్ అచ్చుకట్ల మహమ్మద్, నబీరసూల్, గౌస్, శాలన్‌బాషా, కిశోర్, హుసేన్‌వలి, దూదేకుల బాలహుసేని, ఆకుల హాజీబాషా, హాజీవలి, షాజహాన్, గాజుల అమీర్‌హుసేన్, తదితర 30 కుటుంబాలు బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్నాయి.


టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

వైసీపీకీ ఓటమి భయం పట్టుకుంది : చల్లా


కొండమనాయుని పల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న చల్లా విజయభాస్కర్‌రెడ్డి

అవుకు, ఏప్రిల్ 11: వైసీపీకీ ఓటమి భయం పట్టుకుందని టీడీపీ నాయకుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, మొట్ల రామిరెడ్డి అన్నారు. గురువారం అవుకు మండలంలోని కొండమనాయుని పల్లెలో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇస్మాయిల్‌ఖాన్, సుబ్బయ్య, శ్రీరాములు, గోపాలకృష్ణ, పెద్దన్న, నారాయణస్వామి, చిన్నబాల సుంకన్న, ఆవుల శ్రీను, భూపడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి

నంద్యాల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని రూరల్ ఎస్ఐ నరసింహులు చెప్పారు. ఆళ్లగడ్డ మండలంలోని శాంతినగరం వద్ద అపస్మారక స్థితిలో ఉన్న 62ఏళ్ల వయసున్న వృద్ధుడిని 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని తెలిపారు.

సాయినాథుడికి పూజలు

రుద్రవరం, ఏప్రిల్ 11: రుద్రవరం, చందలూరు గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు, రుద్రవరంలో సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి


డోన్‌లో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కోట్ల


చాగలమర్రిలో నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

డోన్, ఏప్రిల్ 11: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను టీడీపీ డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అంటరానితనాన్ని రూపుమాపి సమాజాన్ని చైతన్యం చేసే విధంగా పూలే ఎంతగానో పోరాడారనీ ఈ సందర్భంగా కోట్ల ప్రశంసించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, కోట్రికే హరికిషణ్, తిమ్మయ్య యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, భూమా నాగన్న, కిరణ్ యాదవ్, సీమ సుబ్బారెడ్డి, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, ఆర్మీ రామయ్య పాల్గొన్నారు.

డోన్(రూరల్), ఏప్రిల్ 11: డోన్ పట్టణంలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. యూటీఎఫ్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, గౌరవాధ్యక్షులు శివశంకరయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చాగలమర్రి, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దామని టీడీపీ బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి సల్లా నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం చాగలమర్రి ముత్యాలపాడు బస్టాండులోని టీడీపీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు ఓబులేసు, బాల దస్తగిరి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

● చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో గురువారం మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, లాలయ్య, లక్ష్మయ్య, చిన్ని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల, ఏప్రిల్ 11 : పట్టణంలోని స్థానిక వివి.కొండారెడ్డి స్మారక గ్రంథాలయంలో మహాత్మాజ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు గురువారం ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లె ఓబయ్య, ఎం.సుధాకర్, ఓబులేసు, దేవరాజు, వెంకటసుబ్బయ్య, రాముడు, నరసింహ పాల్గొన్నారు. అలాగే బీజేపీ కోవెలకుంట్ల మండల ఉపాధ్యక్షుడు మేడా మల్లిఖార్జున ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కోట్రెజరర్ సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడి.. చిన్నారులకు గాయాలు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 11: పిచ్చికుక్క దాడిలో ఐదుగురు చిన్నారులకు గాయాలయ్యాయి. పట్టణంలో చిన్నారులు గాంధీనగర్‌లో ఆడుకుంటుండగా పిచ్చికుక్క వారిపై దాడి చేసి గాయపరిచింది. శ్రీవల్లి, దివ్యభారతి, ఉస్మాన్, మరో ఇద్దరు చిన్నారులు గాయాలపాలయ్యారు. దీంతో కాలనీవాసులు పిచ్చికుక్కపై దాడి చేసి చంపివేశారు. గాయాలపాలైన చిన్నారులను కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు.

మధువనంతపురంలో అరటి తోట దగ్ధం

కొలిమిగుండ రూరల్, ఏప్రిల్ 11: కొలిమిగుండ్ల మండలంలో విద్యుదాఘాతంతో నంద్యాల గంగరాజు అనే కౌలు రైతుకు చెందిన అరటి తోట దగ్ధమైంది. కుమ్మెత శేఖర్‌రెడ్డి అనే రైతుకు చెందిన రెండు ఎకరాల పొలాన్ని గంగరాజు కౌలుకు తీసుకొని అరటి సాగు చేశారు. గురువారం విద్యుదాఘాతం వల్ల అరటి తోటలో మంటలు వ్యాపించాయి. అక్కడే పనులు చేసుకుంటున్న గంగరాజు తోటి రైతులకు సమాచారం అందించారు. రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని బోరు, నీళ్ల ట్యాంకరు సాయంతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఎకరా అరటితోట కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

సంజామల, ఏప్రిల్ 11: మద్యం మత్తులు గురువారం ముక్కమళ్లలో యువకులు ఘర్షణ పడ్డారు. ముక్కమళ్ల గ్రామానికి చెందిన సర్దార్, నరసింహుడు, హుసేని నరేశ్, తదితరులు ఆకుమళ్ల సమీపంలో ఎస్సార్బీసీ కాల్వ వద్ద మద్యం సేవించారు. మద్యం సేవించి ఒకరికొకరు గొడవపడ్డారు. నరసింహుడు, సర్దార్‌లు ఇరువురు కొట్టుకున్నారు. హుసేని ఇరువురిని విడిపించారు. సర్దార్ ఆటోను నరసింహుడిపైకి తగిలించారు. హుసేని ఆటో తగిలి కిందపడ్డారు. మద్యం మత్తులో ఉన్న సర్దార్ కిందపడిన హుసేన్‌పై ఆటో పోనివ్వడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను సర్దార్‌ను, హుసేన్‌ను కోవెలకుంట్ల వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వైభవంగా జ్యోతి ఉత్సవాలు

కొలిమిగుండ రూరల్, ఏప్రిల్ 11: మండలంలోని కనకాద్రిపల్లెలో చౌడేశ్వరీజ్యోతి ఉత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని రామయ్య స్వామి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీమాత ఆలయ ప్రతిష్ట పూర్తి చేసుకొని 41 రోజులయిన సందర్భంగా జ్యోతి ఉత్సవాలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి సాంప్రదాయ పద్ధతిలో భక్తి శ్రద్ధలతో తయారు చేసిన జ్యోతి ప్రతిమలను వైభవంగా ఊరేగించారు.

బలపాలపల్లిలో బీరప్ప స్వామి ఊరేగింపు

బేతంచెర్ల, ఏప్రిల్ 11: మండలంలోని బలపాలపల్లి గ్రామంలో వెలసిన బీరప్పస్వామి ఊరేగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయం నుండి గ్రామంలో బీరప్ప డోలు మధ్య ఊరేగింపు చేశారు. బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర్ నాయక్ తన సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

'పెద్ద ఓబులేసు మృతిపై విచారించాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 11: మండలంలోని నగల్లపాడు గ్రామానికి చెందిన పెద్ద ఓబులేసు మృతిపై విచారణ జరపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య కోరారు. గురువారం చాగలమర్రి పీఎస్ డాబా వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల కడప జిల్లా రాజపాలెం మండలం కూలూరు సమీపంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందారని, ప్రమాదవశాత్తు ఘటన జరిగిందని చెబుతున్నారని చెప్పారు. అయితే వాస్తవానికి రాత్రి వేలలో ఇసుక అక్రమంగా తోలే వారు కూలీ పనికి పిలిచి హత్య చేశారని నిజ నిర్ధారణ కమిటీలో వెల్లడైందని ఆయన తెలిపారు. మట్టి తోలకం వద్ద డ్రైవర్ల మధ్య ఘర్షణలు చోటు చేసుకోవడంతో ఓబులేసు హత్య చేసి ట్రాక్టర్ కింద పడి మృతి చెందినట్లు చిత్రీకరించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేష్, ఓబన్న, తిరుపాల్, ఓబులేసు, నాగరాజు పాల్గొన్నారు.

అంజి కుటుంబానికి అండగా ఉంటాం

బేతంచెర్ల, ఏప్రిల్ 11: మండలంలోని బలపాలపల్లెకు చెందిన డోన్ టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మండల టీడీపీ కార్యకర్త పిక్కిలి అంజి అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గురువారం ఉదయం బలపాలపల్లి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగయ్య, వెంకటేశ్వ రెడ్డి, ప్రసన్నలక్ష్మి, షేక్షావలి చౌదరి తదితరులు ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

రుద్రవరం, ఏప్రిల్ 11: తెలుగుగంగ ప్రధాన కాలువకు చెందిన 21వ బ్లాక్ చానల్‌లో నక్కలదిన్నె సమీపంలో గంగ కాలువ కోసం ముందు జాగ్రత్తగా డంప్ చేసిన మట్టిని కొందరు అక్రమంగా ఎక్స్‌కవేటర్‌తో తవ్వి గురువారం తరలించారు. అక్కడ వర్షం నీరు వెళ్లేందుకు ఒక కల్వర్టు నిర్మాణం చేపట్టేందుకు తవ్వకాలు చేపట్టి, మట్టిని నిల్వచేశారు. అయితే ఆ మట్టిని కొందరు అక్రమంగా తరలించారు. మట్టిని నేరుగా పొలానికి తరలించారు. ఈ విషయంపై జేఈ రాంప్రసాద్‌ను వివరణ కోరగా సిబ్బందిని పంపి విచారిస్తామని తెలిపారు. కాలువ మట్టి తవ్వితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చంద్రబాబుతోనే మహిళా సాధికారత

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ


బూరుగులలో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సుజాతమ్మ

ప్యాపిలి, ఏప్రిల్ 11: చంద్రబాబుతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. గురువారం మండలంలోని సిద్దనగట్టు, కొమ్మెమర్రి, సీతమ్మతండా, బూరుగుల గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి టీడీపీ మెనిఫెస్టో పత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, నాయకులు టి శ్రీనివాసులు, అలేబాదు పరమేష్, ఆర్ఈ నాగరాజు, సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటరాముడు పాల్గొన్నారు.

వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారు

మాజీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


టీడీపీలో చేరిన బండి లక్ష్మీనరసయ్య కుటుంబ సభ్యులు

శిరివెళ్ల, ఏప్రిల్ 11: రాష్ట్రంలో అరాచకంగా సాగుతున్న వైసీపీ పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని మాజీ మంత్రి, టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని గోవిందపల్లె గ్రామంలో గురువారం ప్రచారం నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మురళి, గుర్రప్ప, సూరా రామ, పీపీ లింగమయ్య, బాలచంద్రుడు, సురేష్, కరీం పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

నంద్యాల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలో సీనియర్ వైసీపీ నాయకుడు బండి లక్ష్మీనరసయ్య కుటుంబ సభ్యులను కండువా వేసి మాజీ మంత్రి అఖిలప్రియ, భార్గవ్‌రామ్‌నాయుడు గురువారం టీడీపీలోకి ఆహ్వానించారు. అఖిలప్రియ మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, రాక్షస పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలీశ్వరరెడ్డి, అనంత రామసుబ్బారెడ్డి, మాజీ కౌన్సిలర్ నరసింహులు, పడకండ్ల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు, ఏప్రిల్ 11: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన వంద కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వీరికి మాజీ మంత్రి, ఆళ్లగడ్డ నియోజకవర్గ అభ్యర్థి భూమా అఖిలప్రియ టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బొబ్బూరి వెంకటస్వామి మాట్లాడుతూ వైసీపీ పార్టీ విధి విధానాలు నచ్చక టీడీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, సురేంద్ర, చక్రవర్తినాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్లూరి రమేష్‌నాయుడు, ఎండూరి గోపాల్‌నాయుడు, లింగుట్ల వెంకట్‌నాయుడు, కోయ పుల్లయ్య నాయుడు, సిద్ధి సత్యం, నారాయణస్వామి, చౌడయ్య తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా గండి పూడ్చివేత పనులు

అవుకు, ఏప్రిల్ 11 : అవుకు ప్రధాన లోకల్ ఆయకట్టుకు నీటిని తరలించే ప్రధాన పంట కాల్వకు పడ్డ గండిపూడ్చివేత పనులను ఎస్సార్బీసీ అధికారులు గురువారం ప్రారంభించారు. ఎస్సార్బీసీ ఈఈ సురేశ్‌బాబు, డీఈఈ శిఖామణి ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. కాల్వకు గండి పడ్డ ప్రాంతంలోని సచ్చుమట్టిని ఎక్సకవేటర్‌తో తొలగించారు. అవుకు రిజర్వాయర్ సమీపంలోని నల్లమట్టిని ట్రాక్టర్‌తో తీసుకువచ్చి గండి పూడ్చివేసే పనులు ప్రారంభించారు. రెండు మూడు రోజుల్లో గండి పూడ్చివేత పనులు పూర్తి చసి వరి పంటకు సాగునీరు అందిస్తామని ఎస్సార్బీసీ అధికారులు తెలిపారు.


పంట కాల్వకు పడ్డ గండిని పూడ్చుతున్న దృశ్యం